సాక్షి
నంద్యాల
శనివారం । 25 । మార్చి । 2023



భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయల సేవ నిర్వహించారు. ఊయలలో స్వామి అమ్మవార్లను ఉంచి సహస్రనామ పూజలు చేపట్టారు.



సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు శుక్రవారం 2,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాంలో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉండగా కేసీ కాల్వకు 1,930 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

ఉష్ణోగ్రతలు

కనిష్టం	23.5
గరిష్టం	39.0

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:55
ఆదోని	సా॥ 6:38	ఉ॥ 4:58
నంద్యాల	సా॥ 6:35	ఉ॥ 4:58
ఆత్మకూరు	సా॥ 6:33	ఉ॥ 4:56
బనగానపల్లె	సా॥ 6:36	ఉ॥ 4:56

హదీస్ వెలుగు :

తల్లిదండ్రులను గౌరవించండి. తల్లి పాదాల కింద జన్నత్ (స్వర్గం) ఉంచబడింది. ఆ స్వర్గ ద్వారాల్లో తండ్రి ప్రధాన ద్వారం. తల్లిదండ్రులను కష్టపెడితే స్వర్గంలోకి ప్రవేశించడం కష్టతరం. – పవిత్ర ఖురాన్

పాదయాత్ర, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మరో హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చారు. బోయ/ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా అసెంబ్లీలో తీర్మానం చేశారు. ఇక కేంద్రం ఆమోద ముద్ర వేయడమే తరువాయి, బోయల ఎస్టీ కోరిక నెరవేరనుంది. వీరితో పాటు దళిత క్రైస్తవులను కూడా ఎస్సీ జాబితాలో చేర్చేలా మరో తీర్మానం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై వాల్మీకులతో పాటు దళిత క్రైస్తవుల్లో హర్షం వ్యక్తమవుతోంది.
– సాక్షి ప్రతినిధి కర్నూలు



ఆలూరులో వాల్మీకి విగ్రహం వద్ద సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వాల్మీకులు

ఎన్నాళ్లో వేచిన ఉదయం!

బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా అసెంబ్లీ తీర్మానం

- కేంద్రానికి పంపనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లోనే అధిక సంఖ్యలో వాల్మీకులు
- తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని 70 ఏళ్లుగా పోరాటం
- పాదయాత్ర, ఎన్నికల మేనిఫెస్టో హామీ నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్
- దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేరుస్తూ మరో తీర్మానం



బోయ/వాల్మీకులు తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని 70 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారు. ప్రతి ప్రభుత్వానికి విన్నవిస్తూ, ఉద్యమం చేస్తూనే ఉన్నారు. రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో వాల్మీకులు ఎస్టీలు కాగా, ఇతర ప్రాంతాల్లో బీసీలుగా ఉన్నారు. ఈ సామాజికవర్గం ఎక్కువ ఉన్న ప్రాంతం రాయలసీమ. అందులోనూ ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో అధిక సంఖ్యలో ఉన్నారు. దీంతో తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని సుదీర్ఘ కాలంగా ఉద్యమిస్తున్నారు. అయితే ఏ ప్రభుత్వం వీరి విజ్ఞప్తులను పట్టించుకోలేదు. కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారు. 2017లో ప్రతిపక్షనేతగా ఉన్న వైఎస్ జగన్ పాదయాత్ర మొదలైన తర్వాత కర్నూలు జిల్లాలో వాల్మీకులు భారీ సంఖ్యలో జగన్‌ను కలిసి ఎస్టీ జాబితాలో చేర్చాలని విన్నవించారు. దీంతో 2017 డిసెంబర్‌లో హడావుడిగా అప్పటి టీడీపీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. అయితే ఇది తప్పులతడకగా ఉందని, సరిచేసి మళ్లీ పంపాలని కేంద్రం స్పష్టం చేసింది. ఆ తర్వాత చంద్రబాబు ఈ అంశాన్ని చెత్త బుట్టలో పడేశారు. అప్పట్లో ఎన్డీఏలో టీడీపీ భాగస్వామిగా ఉంది. అయినప్పటికీ ఆయన వాల్మీకుల కలను సాకారం చేయలేకపోయారు.

మాట చెప్పారు.. తీర్మానం చేశారు

పాదయాత్రతో పాటు 2019 ఎన్నికల సభల్లో, వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తానని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఆ మేరకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్ నేతృత్వంలో 'ఏకసభ్య కమిషన్' నియమించారు. ఈ కమిటీ రాయలసీమలో విస్తృతంగా పర్యటించి బోయల జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి, ఎస్టీ కమిషన్‌కు నివేదికలు సమర్పించింది. కమిటీ నివేదిక ఆధారంగా వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తూ ప్రభుత్వం తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు.

దళిత క్రైస్తవులు ఎస్సీ జాబితాలోకి..

దళితులు ఎస్సీ జాబితాలో ఉన్నారు. అయితే కొందరు దళితులు మతమార్పిడి ద్వారా క్రైస్తవులుగా మారారు. వీరు బీసీ–సి జాబితాలో ఉన్నారు. వీరు కూడా తాము ఎస్సీలుగా జన్మించామని, వ్యక్తిగత ఇష్టాయిష్టాలతో మరో మతం స్వీకరించామని.. దీంతో జీవన, ఆర్థిక విధానాల్లో ఎలాంటి మార్పు ఉండదని, తమనూ ఎస్సీ జాబితాలో తిరిగి చేర్చాలని విన్నవిస్తున్నారు. దీనిపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి వైఎస్ ప్రభుత్వం నివేదిక తెప్పించుకుంది. రెడ్డి, కమ్మ, బీసీలతో పాటు ఇతర కులాల వారు క్రిస్టియన్ మతం స్వీకరిస్తే వారు అప్పటి వరకూ ఉన్న రిజర్వేషన్ పరిధిలోనే ఉన్నారని, ఎస్సీలు మతం మారితే వారిని బీసీ–సీలోకి మార్చారని స్పష్టమైంది. ఆర్థిక స్థితిగతులు మాత్రం మారలేదని గ్రహించారు. దీంతో దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేరుస్తూ వైఎస్ ప్రభుత్వం తీర్మానం చేసింది. ఆ తర్వాత ఆయన అకాల మరణంతో కేంద్రంతో మాట్లాడి సాధించే బాధ్యత తర్వాతి ప్రభుత్వాలు తీసుకోలేదు. ఈ క్రమంలో వైఎస్ జగన్ మరోసారి వీరిని ఎస్సీల్లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల దళిత క్రైస్తవుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఢిల్లీ స్థాయిలో ప్రయత్నం చేయాలి



వాల్మీకి/బోయలను ఎస్టీలుగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయం. అయితే తీర్మానం ఆమోదం పొందేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. – ఎం.కుబేరస్వామి, రిటైర్డు వెటర్నరీ ఆఫీసర్

అంబేడ్కర్ వాది వైఎస్ జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానం మేరకు పాలన సాగిస్తున్నారు. ప్రస్తుతం దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. – గోన నాగరాజు, ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు

సీఎంకు రుణపడి ఉంటాం



దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలనే అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం. ఈ డిమాండ్ అనేక సంవత్సరాలుగా నానుతున్నా ఎవరూ ఆలోచనలో పెట్టలేకపోయారన్నారు. – ప్రభుదాస్, కోల్స్ స్టాండింగ్ కమిటీ చైర్మన్

ఇచ్చిన మాటకు కట్టుబడ్డారు



ఇచ్చిన మాటను నిలబెట్టుకునే తత్వం ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలోనే వాల్మీకుల చిరకాల కోరిక నెరవేరనుంది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం తీర్మానం చేసినా, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఉండిపోయింది. – ఎస్.పద్మజానాయుడు, న్యాయవాది

ఒక అడుగు ముందుకు పడింది



వాల్మీకుల చిరకాల కోరిక నెరవేరేందుకు ఒక అడుగు ముందుకు పడింది. వాల్మీకుల మధ్య ప్రాంతీయ వ్యత్యాసాన్ని తొలగించాలని అనేక సంవత్సరాలుగా కోరుతున్నాం. – డాక్టర్ జి.భవానీ ప్రసాద్, మెడికల్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్

న్యూస్‌రీల్

ఉర్దూ మీడియం పాఠశాలల వేళల్లో మార్పు

నంద్యాల(సిటీ): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ఉర్దూ మీడియం ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్లు, ఉర్దూ మీడియం సమాంతర విభాగాల పాఠశాలల వేళలను ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 22వ తేదీ వరకు మార్పుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పాఠశాలలను నిర్వహించాలన్నారు. ఈ మేరకు ఆయా పాఠశాలలకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

ట్యాబ్‌ల్లో సమస్యలను పరిష్కరించాలి

నంద్యాల(సిటీ): పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల్లో సాంకేతిక సమస్యలు ఉత్పన్నం అయితే వాటిని సచివాలయ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ సెక్రటరీ ద్వారా పరిష్కరించాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ శుక్రవారం తెలిపారు. జిల్లాలో 8వ తరగతి చదువుతున్న 17,821 మంది విద్యార్థులకు, 2,909 మంది ఉపాధ్యాయులకు గతేడాది డిసెంబర్‌లో మొత్తం 20,730 ట్యాబ్‌లు పంపిణీ చేసిందన్నారు. వారం రోజుల్లో బోధించిన పాఠాలను ప్రతి శుక్రవారం ఇంటర్నెట్‌కు అనుసంధానం చేసి స్టేటస్‌ను అప్‌డేట్ చేయాలన్నారు. ట్యాబ్‌ల్లో మైనర్ సమస్యలను పరిష్కరించి, మేజర్ సమస్యలను శామ్‌సంగ్ కంపెనీ వారితో సరిచేయిస్తామన్నారు.

ఇంటర్ పరీక్షలకు 855 మంది గైర్హాజరు

నంద్యాల(సిటీ): ఇంటర్మీడియట్ పరీక్షలకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 855 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్‌ఐఓ గురువయ్యశెట్టి శుక్రవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 123 పరీక్షా కేంద్రాల్లో 29,628 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 28,773 మంది హాజరు కాగా 855 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. నంద్యాల జిల్లాలో ఆత్మకూరు సెయింట్ థెరిసా జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఒకరు, చాగలమర్రి ఎస్‌వీఎంపీఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో మరొకరు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడగా డిబార్ చేసినట్లు ఆర్‌ఐఓ తెలిపారు. పకడ్బందీ ఏర్పాట్ల మధ్య పరీక్షలు జరుగుతున్నాయన్నారు.

పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: శ్రీరామనవమి, రంజాన్ పండుగలను హిందూ, ముస్లింలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆయా మత పెద్దలకు జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి సూచించారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పర్వదినాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రజలు సహకరించాలని కోరారు. రంజాన్ సందర్భంగా రాత్రి 11 గంటల వరకు హోటళ్లకు అనుమతించామని అలాగే ఉదయం 4 గంటలకు హోటళ్లు తెరుచుకోవచ్చన్నారు. అన్ని ప్రార్థనా స్థలాల వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామన్నారు. ప్రజలను రెచ్చగొడితే సహించబోమన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రమణ, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐలు ప్రభాకర్‌రెడ్డి, ఆర్ క్రిష్ణయ్య, దస్తగిరిబాబు, రవీంద్ర పాల్గొన్నారు.

వైభవంగా రాయబార మహోత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



అమ్మవారి రాయబార మహోత్సవానికి ఎడ్ల బండ్లపై తరలివస్తున్న భక్తులు

బనగానపల్లెరూరల్: నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి రాయబార మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీచెన్నకేశవ స్వామి ఆలయానికి గురువారం రాత్రి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అర్ధరాత్రి తర్వాత శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహాలను వధూవరులుగా ముస్తాబు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. సాయంత్రం అమ్మవారి రాయబార మహోత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అష్టపుర గ్రామాల నుంచి ఎడ్ల బండ్లపై వచ్చిన భక్తులు చౌడేశ్వరిదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన తేరుబండిపై ఉంచారు. ఆ తర్వాత గ్రామ ముఖ ద్వారం నుంచి జిల్లెల్ల గ్రామ రోడ్డు వైపు ఉన్న చౌడమ్మకుంట వద్దకు మేళతాళాలతో ప్రదర్శనగా వెళ్లారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి రాయబార మహోత్సవాన్ని ముగించారు. ఉత్సవంలో అవాంఛనీయ సంఘటలు జరగకుండా బనగానపల్లె సీఐ సుబ్బరాయుడు, నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

మహానందీశ్వరస్వామికి కాసులు కురిపించిన కన్నడిగులు

- ఐదు రోజులకు రూ. 31.59 లక్షల ఆదాయం



ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: ఉగాది మహోత్సవాల సందర్భంగా మహానంది ఆలయానికి వచ్చిన కర్ణాటక భక్తులు మహానందీశ్వరస్వామికి కానుకల రూపంలో కాసులు కురిపించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది భక్తులు అధికసంఖ్యలో తరలి రావడంతో ఐదు రోజులకు రూ. 31,59,611 ఆదాయం లభించినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు దేవస్థానం కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు వసతి గృహాలు, స్పెషల్ దర్శనాలు, ఆర్జితసేవలు, అభిషేకం, లడ్డూ ప్రసాదాలు, ఇతర విభాగాల ద్వారా ఈ ఆదాయం లభించినట్లు చెప్పారు. వీటిలో స్పెషల్ దర్శనం టికెట్ల ద్వారానే రూ.23,30,115 రావడం విశేషం. గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా రూ. 5,50,019 పెరిగిందన్నారు.

అతివలకు ఆర్థిక ఆసరా

- నేడు మూడో విడత వైఎస్సార్ ఆసరా నిధులు విడుదల
- 21,001 గ్రూపుల ఖాతాల్లో జమ కానున్న రూ. 136.10 కోట్లు
- బటన్ నొక్కి మహిళల ఖాతాల్లో జమ చేయనున్న సీఎం జగన్
- నిధులు నేరుగా సంఘాల సభ్యుల చేతికే..
- 26 నుంచి పది రోజుల పాటు ఆసరా ఉత్సవాలు

'ఎన్నికల రోజు వరకు అక్కచెల్లెమ్మలు బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న పొదుపు రుణాల మొత్తం సొమ్మును నాలుగు విడతల్లో మీ చేతికే అందిస్తాం... ఆ డబ్బుతో మీరేమైనా చేసుకోండి.. అంతేకాదు మళ్లీ సున్నా వడ్డీకే రుణాలు ఇప్పిస్తాం'. అంటూ నాడు ప్రజా సంకల్ప పాదయాత్రలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీ ఏటా క్రమం తప్పకుండా అమలవుతోంది. మూడో విడత వైఎస్సార్ ఆసరా నిధులు పొదుపు గ్రూపు సభ్యుల అకౌంట్లలో శనివారం జమకానున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నంద్యాల/ఆళ్లగడ్డ: మహిళలు ఆర్థికంగా రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రతి పేద మహిళ లక్షలాధికారి కావాలనే లక్ష్యంతో ఆదుకుంటోంది. పొదుపు గ్రూపు సభ్యులకు ఓ వైపు సున్నా వడ్డీ కింద రుణాలు మంజూరు చేయించడంతో పాటు వైఎస్సార్ ఆసరా కింద నిధులు మంజూరు చేస్తోంది. శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి పొదుపు గ్రూపుల ఖాతాల్లో ఆసరా నిధులను జమ చేయనున్నారు. ఈ మేరకు అధికారులు సంఘాల వివరాలు సేకరించి లబ్ధిదారుల వివరాలను యాప్‌లో పొందుపర్చడం చేశారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో సార్వత్రిక ఎన్నికల (2019 ఏప్రిల్ 11వ తేదీ) నాటికి బ్యాంకు లింకేజీ ద్వారా 22,711 సంఘాలు రుణాలు పొంది ఉన్నాయి. ఇందులో 2,25,390 మంది సభ్యులుగా ఉన్నారు. ఈ సంఘాలకు చెందిన మొత్తం రూ.544.46 కోట్లు నాలుగు విడతల్లో సభ్యులకు చెల్లించేందుకు జగనన్న ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా మొదటి విడతగా 2020 నవంబర్ 9న 20,859 పొదుపు గ్రూపుల ఖాతాల్లో రూ.105.54 కోట్లు, రెండో విడతగా 2021 అక్టోబర్ 7న 21,00,7 సంఘాలకు రూ.136.89 కోట్లు జమ చేసింది. మూడో విడతగా ఈ నెల 25న 21,00,1 గ్రూపుల ఖాతాల్లో రూ 136.10 కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేయనుంది. ఇప్పటికే మూడో విడత లబ్ధి పొందే అర్హుల జాబితాను సచివాలయాల్లో అతికించి బహిరంగంగా ప్రదర్శించారు. జాబితాలో ఏవైనా పొరపాట్లు ఉన్నా, జాబితాలో గ్రూపుల పేర్లు లేకపోయినా.. మళ్లీ అర్హత పొందేందుకు అవకాశం కల్పించేలా చర్యలు చేపట్టారు.

వచ్చేనెల 5 వరకు వారోత్సవాలు..

వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ ఉత్సవాలను ప్రభుత్వం పదిరోజుల పాటు పండుగలా నిర్వహించనుంది. ఈనెల 26వ తేదీ నుంచి ఏప్రిల్ 5 వరకు ప్రతి నియోజకవర్గ పరిధిలో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. ఇప్పటికే గ్రామ, వార్డు వలంటీర్లు, పట్టణ రిసోర్స్ పర్సన్లు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు ఆయా పొదుపు సంఘాలతో సమావేశాలు నిర్వహించి మూడో విడతలో ప్రభుత్వం వారికి ఎంత మొత్తం లబ్ధి చేకూర్చిందో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు.

జిల్లాలో మొత్తం డ్వాక్రా సంఘాలు	32,291
సంఘాల్లో ఉన్న మొత్తం సభ్యులు	3,87,492
మూడో విడత ఆసరాకు ఎంపికైన సంఘాలు	21,001
జమ కానున్న నగదు	రూ 136,10,83,262
లబ్ధి పొందనున్న సభ్యులు	2,36,876



శిరివెళ్లలో మూడో విడత వైఎస్సార్ ఆసరా అర్హుల నుంచి బయోమెట్రిక్ సేకరిస్తున్న వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు

ఎన్‌పీఏ సంఘాలకు...

సార్వత్రిక ఎన్నికలు ముగిసే సమయానికి ఎన్‌పీఏ (మొండి బకాయిలు) సంఘాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సంఘాలు తీసుకున్న రుణం చెల్లించక పోవడం, వలస వెళ్లి పోవడం, సభ్యుల మధ్య తలెత్తిన విభేదాల కారణంగా రుణం కంతులు చెల్లించకుండా సంఘాన్ని నడపక పోవడం తదితర వాటిని ఎన్‌పీఏ కింద చేర్చారు. ఆయా సంఘాలకు సంబంధించిన వివరాలను కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు 'వైఎస్సార్ ఆసరా' యాప్‌లో నమోదు చేశారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే వీరికి కూడా ఆసరా దక్కనుంది.

పది రోజుల పాటు ఉత్సవాలు



నంద్యాల జిల్లాలో 2,09,692 మంది మహిళలకు మూడో విడత రూ.136.10 కోట్లు లబ్ధి చేకూరనుంది. జిల్లాలో పొదుపు మహిళలకు రుణం మొత్తం రూ.544.46 కోట్లు ఉండగా ఇప్పటికే మొదటి విడతగా రూ.105.54 కోట్లు, రెండో విడత రూ.136.89 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. నాలుగు విడతల్లో చెల్లించాల్సి ఉండగా ఈనెల 25న మూడో విడత రూ.136.10 కోట్లు చెల్లించనుంది. వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ ఉత్సవాలను పదిరోజుల పాటు నిర్వహించనున్నాం. – శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల

జగనన్న మేలు మరువం



వైఎస్సార్ ఆసరా వల్ల చేకూరిన లబ్ధి వల్ల నేను గ్రామంలో చీరల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాను. సరస్వతి గ్రూపు సభ్యులమైన మేము 2019లో రూ.4.80 లక్షలు రుణం తీసుకున్నాం. ఇప్పటి వరకు రెండు విడతల్లో రూ.2.40 లక్షలు ప్రభుత్వం చెల్లించింది. వ్యక్తిగతంగా నాకు రూ.24 వేలు ఇప్పటి వరకు లబ్ధి చేకూరింది. వైఎస్సార్ ఆసరా, చేయూత, చేదోడు పథకాల వల్ల వచ్చిన లబ్ధితో చీరల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని సంతోషంగా పోషించుకుంటున్నా. జగనన్న మేలును ఎప్పటికీ మరువలేం. – మౌలాబీ, పొదుపు మహిళ, వీరాపురం గ్రామం, కొత్తపల్లి మండలం

ప్రభుత్వ సాయంతో దుకాణం నడుపుతున్నా



గత ప్రభుత్వ హయాంలో పొదుపు గ్రూపు నుంచి రూ. లక్ష రుణం తీసుకున్నా. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పొదుపు మహిళలకు రుణమాఫీ హామీ ఇచ్చి మోసం చేయడంతో రుణం కట్టలేక పోయాను. దీంతో వడ్డీ భారం పెరిగింది. ఇచ్చిన మాట ప్రకారం జగనన్న ఇప్పటికే వైఎస్సార్ ఆసరా కింద రెండు విడతలుగా మొత్తం రూ. 40 వేలు ఇచ్చారు. అలాగే వడ్డీ లేని రుణం రూ. లక్ష తీసుకుని గ్రామంలో కిరాణ దుకాణం నడుపుకుంటూ కుటుంబానికి సాయంగా నిలిచాను. – రత్నమ్మ, దబ్బ్యా గోవిందిన్నె, దొర్నిపాడు మండలం

క్లుప్తంగా

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరురూరల్: మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, గోరంట్ల ప్రిన్సిపాల్ ఎస్.షసున్నిసా పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2023–2024 విద్యా సంవత్సరానికి జిల్లాలోని మూడు పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. బాలికలు ఆరేకల్, వెల్దుర్తి, బాలురు గోరంట్ల గురుకుల పాఠశాల్లో చేరేందుకు అవకాశం ఉందని తెలిపారు. ప్రతి గురుకుల పాఠశాలలో 80 సీట్లు ఉంటాయని, బీసీ విద్యార్థిని, విద్యార్థులకు 9 నుంచి 11 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 9 నుంచి 13 సంవత్సరాల వరకు వయస్సు ఉండవచ్చునని చెప్పారు. విద్యార్థులు ఏప్రిల్ 4లోపు https// mjpapbcwreis.apcfss.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'పది' విద్యార్థులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం

కర్నూలు(రాజ్‌విహార్): పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు కర్నూలు జిల్లా ప్రజా రవాణ శాఖ అధికారి (ఆర్టీసీ ఆర్‌ఎం) టి. వెంకటరామం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.పరీక్షల రోజున విద్యార్థులకు ప్రయాణ ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వ ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే పరీక్షల రోజున విద్యార్థులు బస్ పాసులు లేకపోయినా కేవలం హాల్ టికెట్ చూపించి పల్లె వెలుగు (ఆర్డినరీ), విద్యార్థి బస్సుల్లో నివాస ప్రాంతం నుంచి పరీక్ష కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. పరీక్ష సమయానికి 2 గంటల ముందు, పరీక్ష పూర్తయిన సమయం తరువాత రెండు గంటల వరకు మాత్రమే బస్సుల్లో అనుమతిస్తారని, సెలవు రోజుల్లో పరీక్ష ఉన్నా ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. ఉచిత ప్రయాణంలో ఎలాంటి సమస్య తలెత్తినా 99592 25793 (కర్నూలు–1 డీఎం), 99592 25794 (కర్నూలు–2 డీఎం), 99592 25796 (ఎమ్మిగనూరు డీఎం), 99592 25797 (ఆదోని, పత్తికొండ డీఎం) నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

పిడుగుపడి వలస కూలీ మృతి

కౌతాళం: ఉపాధి కోసం వలస వెళ్లిన కూలీ పిడుగుపాటుకు మృత్యువాత పడ్డాడు. వల్లూరు గ్రామానికి చెందిన దేవేంద్ర (30) గుంటూరు పరిసర పల్లెల్లో మిరప పంట కోత పనులకు వెళ్లాడు. శుక్రవారం సాయంత్రం మిరప పంట కోస్తుండగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తోటి కూలీలు తెలిపారు. దేవేంద్రకు భార్య నిర్మల, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పంచ సూత్రాలు.. ముక్తికి మార్గాలు

- చెడుకు దూరం.. మంచికి మార్గం రంజాన్
- ఐదు సూత్రాలు అనుసరించాలంటున్న ఇస్లాం
- ఈమాన్, నమాజ్, రోజా, జకాత్, హజ్ యాత్ర చేయాలని సూచన
- అల్లా మార్గంలో నడవాలంటున్న పెద్దలు

కర్నూలు(రాజ్‌విహార్): సర్వమానవాళి శాంతి మార్గంలో నడవాలని ఇస్లాం సూచిస్తోంది. ప్రతి వ్యక్తి చెడుకు దూరంగా, సన్మార్గంలో నడవాలని బోధిస్తోంది. అల్లా ప్రసాదించిన పవిత్ర గ్రంథం దివ్య ఖురాన్. ఈ గ్రంథం అవతరించింది రంజాన్ మాసంలోనే. ఈ మాసంలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఆధ్యాత్మికంగా గడిపేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. తమ జీవితంలో పాటించాల్సిన పంచ నియమాలను మహమ్మద్ ప్రవక్త సూచించారు. అవే ఈమాన్, నమాజ్, రోజా, జకాత్, హజ్ యాత్ర. వీటిలో నమాజ్, రోజా, జకాత్‌ను ముస్లింలు రంజాన్ మాసంలో మరింత భక్తితో పాటిస్తారు. మరోవైపు మంచి విద్య నేర్చుకునేందుకు, ఇతరులకు బోధించేందుకు అల్లా మార్గంలో నడుకోవాలని మత పెద్దలు అంటున్నారు.

ఈమాన్

ఇస్లాం మత మొదటి నియయం ఈమాన్. లాయిలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదూర్ రసూలుల్లా (సొల్లెల్లాహు అలైహి వసల్లం) అని కలిమా తయ్యిబా చదివి ఇస్లాం మతాన్ని స్వీకరించిన ప్రతి ఒక్కరూ అందుకు కట్టుబడి ఉండాలి. అల్లా యే భగవంతుడని, ఇతరులకు దైవారాధన చేయరాదని ఈ నియమం చెబుతుంది. అతని ప్రవక్త మహమ్మద్ రసూలుల్లాపై మాత్రమే విశ్వాసాన్ని ఉంచాలి.

నమాజ్

కలిమా తయ్యిబా చదివి ఈమాన్‌తో ఇస్లాం స్వీకరించిన ప్రతి ముస్లిం రోజుకు ఐదు పూటలా విధిగా నమాజ్ చదవాలి. సూర్యోదయానికి ముందు ఫజర్, మధ్యాహ్నం ఒంటిగంట తరువాత జోహర్, సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో అసర్, సూర్యాస్తమయం తరువాత మగ్‌రిబ్, రాత్రి 8గంటల ప్రాంతంలో ఇషా నమాజు చేయాలి. ఐదు పూటల నమాజ్‌ను 'ఫరజ్'(తప్పనిసరి) అంటారు.



కర్నూలులో శుక్రవారం సాయంత్రం ఉపవాస దీక్ష విరమిస్తున్న ముస్లింలు

రోజా: రోజా అంటే ఉపవాసాల దీక్ష. మానసిక పరిపక్వత కలిగి, ఆరోగ్యకరంగా ఉన్న ప్రతి ముస్లిం రంజాన్ మాసంలోని రోజాలు పాటించాలి. ఈనెలలో ఉండే రోజాలను ఫరజ్ రోజాలంటారు. నెలంతా నియమ, నిష్టలతో ఉపవాస దీక్ష ఆచరించాలి. సూర్యోదయం కంటే ముందు నుంచి సూర్యాస్తమయం తరువాత వరకు ఆహారం, నీరు, ఇతర ఎలాంటి తినుబండరాలు, పానీయాలను సైతం తీసుకోకుండా ఆచరించాలని ఇస్లాం మతం చెబుతోంది. ఏడాదిలోని 12 నెలల్లో ఒక నెల అల్లా కోసం ఆయన సూచించిన మార్గంలో నడిచి మిగతా నెలల్లో అదే స్ఫూర్తితో నడుచుకోవాలి.

జకాత్: ధనవంతులు, దానం చేయగల ఆర్థిక స్తోమత కలిగిన వారందరూ విధిగా వస్తు, ధన రూపాల్లో పేదలకు దానం చేయడాన్నే జకాత్ అంటారు. ఒక కుటుంబంలో 7.5 తులాల బంగారం, 52.5 తులాల వెండి ఆభరణాలు, తత్సమానమైన ధనం ఉంటే అందులో 2.5 శాతం విలువ గల వాటిని దాన, ధర్మాలు చేయాలి.

హజ్ యాత్ర: ఆర్థిక స్తోమత కలిగిన ముస్లింలు విధిగా హజ్ యాత్ర చేయాలి. 40 రోజుల పాటు సౌదీ అరేబియాలోని మక్కా, మదీనా ప్రాంతాలకు వెళ్లి అక్కడి పుణ్య క్షేత్రాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయాలి. బక్రీదు పండుగ సమయంలోనే హజ్ జరుగుతుంది. అప్పు చేసి ఈ యాత్ర చేయాల్సిన అవసరం లేదు. ఈ యాత్రకు వెళ్లినప్పటి నుంచి తిరిగి వచ్చే వరకు కుటుంబ పోషణకు అవసరమైన నిధులు ముందుగానే సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

అల్లా మార్గంలో నడవాలి: ఇస్లాం ధర్మాలు, నియమ నిబంధనలు, పాటించాల్సిన సూత్రాలు, ఆచరించాల్సిన పద్ధతులను తెలుసుకోవడం చాలా అవసరం. వీటిని ఇళ్ల వద్ద ఉండి నేర్చుకోలేని పక్షంలో దైవ మార్గంలో నడవాలి. తమ పనులు, వృత్తి, వ్యాపారం వంటి వాటిని కొంత కాలం పాటు వదిలి 'అల్లాకే రాస్తేమే' వెళ్లి విద్య నేర్చుకోవాలి. నేర్చుకున్న అంశాలను ఇతరులకు పంచి, అందరూ మంచి మార్గంలో నడిచేలా కృషి చేయాలని మత పెద్దలు సూచిస్తున్నారు.

సెట్–2 ప్రశ్నపత్రాల తరలింపు

నంద్యాల(సిటీ): ఏప్రిల్ 3వ తేదీన జిల్లా వ్యాప్తంగా జరిగే పదవ తరగతి పరీక్షలకు సంబంధించిన సెట్–2 ప్రశ్నపత్రాలను శుక్రవారం జిల్లాకేంద్రంలోని డీఈఓ కార్యాలయం నుంచి అన్ని మండల కేంద్రాలకు తరలించారు. ఈ సందర్భంగా డీఈఓ అనురాధ మాట్లాడుతూ పది పరీక్షలకు 125 కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఈ మేరకు 125 చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించామన్నారు.

కస్తూర్బాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(సిటీ): జిల్లాలోని కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి, 7, 8, 9 తరగతులలో మిగిలిన సీట్లను భర్తీ చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈఓ అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న 27 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నామన్నారు. వెనుకబడిన వర్గాలు, పేద, అనాథ, బడిబయట పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలు http:// apkgbv.apcfss.in:// వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్‌ల ద్వారా సమాచారం అందిస్తామన్నారు. వివరాలకు 9000109934ను సంప్రదించాలన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ

- జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు చెప్పారు. ప్రపంచ క్షయ వ్యాధి అవగాహన దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీ వద్ద జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీ ఆసుపత్రి నుంచి కలెక్టరేట్ మీదుగా మెడికల్ కాలేజీ వరకు సాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అనంతరం క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలోని టీబీసీడీ వార్డులో క్షయ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రామగిడ్డయ్య, జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ మాట్లాడుతూ 2022 సంవత్సరంలో 42,297 మందిని పరీక్షించగా 5,162 మందికి క్షయ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డీఐవో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాలనాగాంజన్, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ రమేష్, డాక్టర్ మోక్షేశ్వరుడు, వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినిలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు

గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

కర్నూలు(సెంట్రల్): జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకంలో భాగంగా చేపట్టిన రీసర్వేలో గ్రౌండ్ ట్రూతింగ్ అత్యంత కీలకమని, ఈ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రీసర్వేపై రెవెన్యూ, సర్వే శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..దాదాపు 100 సంవత్సరాల తరువాత చేపడుతున్న రీసర్వే పనులు నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలన్నారు. జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి మాట్లాడుతూ మొదటి దశలో 472 రెవెన్యూ గ్రామాలకుగాను 68 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామన్నారు. వెబ్ ల్యాండ్ నుంచి వెబ్ ల్యాండ్ 2.0కు పోర్టింగ్ మారిన తొలి జిల్లా కర్నూలు అని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ మల్లికార్జునుడు, కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్, సర్వే అండ్ ల్యాండ్స్ ఏడీ పవన్‌కుమార్, కేఆర్‌సీసీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర నాగప్రసన్న లక్ష్మీ, డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే విజయ సారథి పాల్గొన్నారు.



'ఈత'రం సరదా

వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో యువకులు కాలువల్లో ఈత కొడుతూ తాపాన్ని తీర్చుకుంటున్నారు. హొళగుంద సమీపంలోని తుంగభద్ర దిగువ కాలువలో శుక్రవారం చిన్నారులు జలకాలాడుతూ ఏమీ హాయిలే ఇలా అంటూ సందడి చేశారు. – హొళగుంద

పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందిస్తాం

- చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్



మాట్లాడుతున్న పైడా కృష్ణప్రసాద్



హాజరైన వ్యాపారులు

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందిస్తామని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పైడా కృష్ణప్రసాద్ అన్నారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ రాయలసీమ జోన్ ఎంఎస్ ఎంఈలు, ట్రేడర్స్ సమావేశం శుక్రవారం సాయంత్రం కర్నూలులోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమాన్ని యువ పారిశ్రామికవేత్త టీజీ భరత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఎంఎస్ ఎంఈలకు సంబంధించి రూ.950 కోట్ల సబ్సిడీని రెండు దఫాలుగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వాణిజ్యం సులభతరం చేసే చర్యలను చాంబర్ ఆఫ్ కామర్స్ చేపడుతోందన్నారు. రాయలసీమ జోన్ డైరెక్టర్ కె.రామలింగారెడ్డి మాట్లాడుతూ ఓర్వకల్లులో వేల ఎకరాల్లో పరిశ్రమల స్థాపనకు అవకాశాలు ఉన్నాయన్నారు. సమావేశంలో ఫెడరేషన్ ఎలక్టెడ్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కర్‌రావు, జనరల్ సెక్రటరీ బి.రాజశేఖర్, ట్రెజరర్ ఎస్.అక్కయ్య నాయుడు, రాయలసీమ జోన్ చైర్మన్ ఐ.వి జయకుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ పి.రంగారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కె.వి.చౌదరి తదితరులు పాల్గొన్నారు.

దళిత రైతులకు 'అమృత్' రుణాలు

కర్నూలు(అర్బన్): కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అమృత్ జల ధార పథకం కింద జిల్లాలోని దళిత రైతులకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్ శ్రీనివాసకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ రైతుల భూములకు నీటి వసతిని ఏర్పాటు చేసుకునేందుకు ఈ ఆర్థిక సహాయం అందించనున్నట్లు చెప్పారు. కనీసం 2.50 ఎకరాల భూమి కలిగి ఉండి వార్షిక ఆదాయం రూ.3 లక్షల లోపు ఉన్న రైతులు అర్హులన్నారు.ప్రాజెక్టు విలువలో 50 శాతం సబ్సిడీ లేదంటే రూ.50 వేలు రాయితీ మించకుండా మంజూరు చేస్తామన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందాలంటే తప్పనిసరిగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఏ బ్యాంకులోనైనా రుణం కోసం దరఖాస్తు చేసుకుని ఉండాలన్నారు.

ఎస్సీ నిరుద్యోగ యువతకు 50 శాతం సబ్సిడీపై రుణాలు

యంగ్ ఎంటర్ ప్రెన్యూర్ పథకంలో భాగంగా ఎస్సీ నిరుద్యోగ యువతకు ట్రాక్టర్, ట్రాలీ, కమర్షియల్ వాహనాలు, వేర్ హౌసెస్ తదితర స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు రుణాలను మంజూరు చేయనున్నట్లు ఈడీ తెలిపారు. ప్రాజెక్టు విలువలో 50 శాతం సబ్సిడీ కానీ రూ.60 వేలు రాయితీ మించకుండా మంజూరు చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తులను కర్నూలులోని జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార సంఘం కార్యాలయంలో అందించాలన్నారు. తెల్ల రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్ ప్రతులను జతపరచాలన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగలు అరెస్ట్

- రూ.30 లక్షలు విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- ఒక కారు సీజ్ చేసిన ఆదోని త్రీటౌన్ పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వినోద్‌కుమార్



దొంగలను అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ వినోద్‌కుమార్, చిత్రంలో రికవరీ చేసిన బంగారు, వెండి ఆభరణాలు

ఆదోని అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులమని నమ్మిస్తూ ఇళ్లలో చోరీలకు పాల్పడే అంతర్ రాష్ట్ర దొంగలను ఆదోని త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.30 లక్షలు విలువ చేసే బంగారం, వెండి ఆభరణాలను, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీయస్పీ వినోద్‌కుమార్ వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం భద్రావతి తాలూకా దొడ్డేరి గ్రామానికి చెందిన యోగేష్, కెంచెప్పలు వరుసకు అన్నదమ్ములు. కెంచెప్ప చెల్లెలును అదే గ్రామానికి చెందిన రవికి ఇచ్చి పెళ్లి చేశారు. యోగేష్, కెంచెప్ప, రవి ముగ్గురూ కలిసి కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, గోవా, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల్లో తాము ప్రభుత్వ ఉద్యోగులమని నమ్మిస్తూ చోరీలు చేసేవారు. ఈ ముగ్గురు కలిసి షిఫ్ట్ కారులో గతేడాది జూలై 15వ తేదీన ఆదోని పట్టణంలోని అరుంజ్యోతినగర్‌లో సంధ్యారాణి ఇంటికి వెళ్లారు. తాము మున్సిపల్ కార్యాలయం నుంచి వచ్చామని నమ్మించారు. ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ ప్రోగ్రాంలో భాగంగా ఇంటింటికి తిరిగి డ్రెయినేజీ పైపులు చెక్ చేస్తున్నామని చెప్పారు. ఐడీ కార్డులను చూపించడంతో నమ్మిన సంధ్యారాణి ఇంటి వెనక ఉన్న డ్రెయినేజీ వద్దకు యోగేష్, కెంచెప్పలను తీసుకెళ్లారు. వారు పైపులు పరిశీలించేటప్పుడు రవి ఇంట్లోకి దూరి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను తస్కరించాడు. పైపులు చెడిపోయానని, సిబ్బందితో కొత్తవి వేయిస్తామని చెప్పి యోగేష్, కెంచెప్పలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సంధ్యారాణి ఇంట్లో వెళ్లి చూడగా బీరువాను తెరిచి ఉంది. చోరీ జరిగిందని నిర్ధారించుకుని ఆమె త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరపగా చోరీ చేసిన వారు యోగేష్, కెంచెప్ప, రవి అని తేలింది. వీరు హవేరీ జిల్లా జైలులో ఉండగా వారెంట్‌పై అరెస్ట్ చేసి ఆదోనికి తీసుకొచ్చారు. వారి వద్ద నుంచి సంధ్యారాణి ఇంట్లో దొంగలించిన 90 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. దొంగతనాలను ఒక షిఫ్ట్ కారులో వెళ్లి చేశారన్నారు. ముగ్గురిలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు, రవి అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని, ప్రత్యేక టీం ఏర్పాటు చేసి త్వరలో పట్టుకుంటామని చెప్పారు. ప్రత్యేక బృందంగా ఏర్పడి దొంగలను పట్టుకొని ఆభరణాలను రికవరీ చేసిన సీఐ శ్రీరామ్, ఎస్‌ఐ జయకృష్ణ, కానిస్టేబుళ్లు, నరేంద్ర, కృష్ణయ్యనాయుడు, చిన్నవెంకటేశ్వర్లను డీయస్పీ అభినందించారు. వీరికి జిల్లా ఎస్పీ సిద్ధార్థకౌశల్ రివార్డులు ప్రకటిస్తారని చెప్పారు.

ఎక్కడెక్కడ చోరీ చేశారంటే..

- ఆదోని పట్టణం రాఘవేంద్ర కాలనీలో గతేడాది నవంబర్ 9వ తేదీన ఉదయం ఇంటి తాళాలు పగలగొట్టి 165 గ్రాముల బంగారం, 375 గ్రాముల వెండి ఆభరణాలను దొంగలించారు.
- గతేడాది అక్టోబవర్ 29వ తేదీన కర్నూలు మిలటరీ కాలనీలో 80 గ్రాముల బంగారం, కొత్తపేటలో ఈ యేడాది జనవరి 18వ తేదీన 20 గ్రాముల బంగారం, సుంకేసుల రోడ్డులోని బ్యాంకు ఆఫీసర్ కాలనీలో ఈ యేడాది జనవరి 21వ తేదీన 30 గ్రాములు, సప్తగిరి కాలనీలో ఈ యేడాది ఫిబ్రవరిలో 55 గ్రాముల బంగారం, వంద గ్రాముల వెండి ఆభరణాలను దొంగలించారు.
- చిప్పగిరి గ్రామంలో గతేడాది డిసెంబర్ 27వ తేదీన 30 గ్రాములు బంగారం, మాధవరం మండలం మాలపల్లె గ్రామంలో ఈ యేడాది జనవరి 4వ తేదీన 30 గ్రాములు బంగారు ఆభరణాలు చోరీ చేశారు.
- మొత్తం 8 దొంగతనాల్లో 500 గ్రాముల బంగారం, 475 గ్రాముల వెండి ఆభరణాలను చోరీ చేశారని, వీటిని రికవరీ చేశామని డీఎస్పీ తెలిపారు. వీటి విలువ రూ.30 లక్షలు దాకా ఉంటుందని, ఒక షిఫ్ట్‌కారు సీజ్ చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

రంజాన్‌లో ముస్లిం ఉద్యోగులకు ఊరట

కర్నూలు(రాజ్‌విహార్): పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కలిగించింది. నెల రోజుల పాటు సాయంత్రం సాధారణ విధుల ముగింపు సమయం కంటే ఒక గంట ముందుగా ఇళ్లకు వెళ్లిపోయే వెసులుబాటు కల్పించింది. ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కళాశాలల వేళల్లో కూడా మార్పులు చేసింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1:30 (ఒంటి పూట) గంటల వరకు విద్యాసంస్థలు పనిచేసేలా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాలని ఇంటలెక్చువల్ కలెక్టివ్స్ జిల్లా కన్వీనర్ ఎం.ఖదీరుల్లా ఒక ప్రకటనలో కోరారు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే 9848277786 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(రాజ్‌విహార్): జిల్లాలో మూడు మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలు, 26 ఆయాల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జి జిల్లా అధికారిణి ఎస్.ఉమామహేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.